# అసమర్థుని ప్రేమకథ

## బొమ్మిడి అచ్చారావు



**ఆంజనేయులు** వయసిప్పుడు పాతికేళ్ళు. అతనికి వయసంటే వచ్చింది కాని, అతని వయసుకి వయసు రాలేదు. తనకి వయసొచ్చి మీద పడుతున్నదని కాని, ఈ వయసులో తనకో తోడు ఎంతయినా అవసరమని కాని అతడు గ్రహించాడో, లేదో తెలీదు కాని, తోడు కోసం ప్రయత్నించినట్టు దాఖలాలేం కనిపించవు.

తల్లి పోరగా పోరగా ఆంజనేయులు తండ్రి నిర్ణయించిన ఏలూరు సంబంధం తాలూకు అమ్మాయిని చూడటానికి సిద్ధపడ్డాడు. మనసులో ఏ మాత్రం ఇష్టం లేదు—తండ్రికి భయపడి! అమ్మ, నాన్నలకి ఆ అమ్మాయి చాలా లక్షణంగాను, పొందికగాను కనిపించింది. చూడగానే కోడలిగా మనసులో నిర్ణయాలు చేసేసుకున్నారు. కాని అదేం పాపమో ఆంజనేయులికి ఆ అమ్మాయి ఎంత మాత్రం నచ్చలేదు. తన మనసులో తిష్ట వేసుక్కూచ్చున్న రూపానికి ఆ అమ్మాయిని పోల్చి చూసుకుని, పొత్తు కుదరక కుర్చీలో ఇబ్బందిగా కదిలాడు. ఆ తరవాత పక్కకు పిలిచి అభిప్రాయమడిగిన తండ్రితో భయం భయంగానే చెప్పేశాడు తన నిర్ణయం!

ఆ తరవాత తరవాత ఆంజనేయులు చాలా సంబంధాలు చూశాడంటే అందుకు కారణం—తండ్రి తిడతాడని భయం కావచ్చు, తల్లి మొండి పట్టుదల కావచ్చు. ఏమైతేనేం, అతని ఈ వింత మనస్తత్త్వం రకరకాల వ్యాఖ్యానాల కెర అయింది. అతనిలో ఏదో లోపముందని, దాన్ని కప్పిపుచ్చుకోవటానికే ఈ పెళ్ళి చూపుల తతంతం జరిపి నచ్చలేదని నాటక మాడుతున్నాడని బంధువుల్లో ఒక దురభిప్రాయం ఏర్పడి పోయింది. అంతే! ఆంజనేయులుకి పిల్లనిస్తామని ఆడపిల్లల తండ్రులు ముందుకి రావటానికి జడిసిపోయారు.

అసలు ఆంజనేయులు మనసులో తిష్ట వేసుకున్న పిల్ల సంగతి తెలుసుకోవాలంటే మనం కొంతకాలం వెనక్కి వెళ్ళి రావాల్సి ఉంటుంది.

ఆంజనేయులు వస్తుతః బిడియస్థుడు. చిన్నప్పటి నుంచీకూడా చదువు విషయంలో బ్రిలియంటే అయినా, క్లాసులో శుద్ధ మొద్దావతారంలా కూచుని ఉండేవాడు. స్కూల్‌ఫైనల్ వరకు అమ్మాయిల సెక్షన్‌లోనే చదివాడు. అయినా, ఆడపిల్లలతో అతనే రోజూ నోరు విప్పి మాట్లాడడానికి భయపడేవాడు. అతను తమతో మాట్లాడటమే మహాభాగ్యం అనుకునే అమ్మాయిలు లేకపోలేదు. ఒకరిద్దరమ్మాయిలు అతణ్ణి మాట్లాడించటానికి, పరిచయం పెంచుకోవటానికి, తద్వారా అతని హృదయంలో తిష వేసుకోవటానికి చాలా చాలా ప్రయత్నాలు చేశారు. కాని ఆడపిల్లల మైనా తమకి లేని బెరుకు, బిడియం లాంటి లక్షణాలు అతడితో చూసి [illegible]డీతో ఫుల్‌స్టాప్ పెట్టేశారు. నీరజ అనే అమ్మాయికి ఆంజనేయులంటే ప్రాణం. అయితే ఆమె ఏ నాడూ బయటపడలేదు. సమయం కోసం ఎదురు చూస్తుండగానే స్కూల్ ఫైనల్ పరీక్షలొచ్చేశాయి.

స్కూల్ ఫైనల్ పరీక్షలకి ఆంజనేయులు బాయ్స్ వాళ్ళకి అదే ఊళ్ళోని మరో స్కూల్ సెంటర్‌గా ఇచ్చారు. ఒక రోజు ఆంజనేయులు పరీక్ష రాయటానికి వెళుతుండగా, దారిలో అతణ్ణి ఒంటరిగా కలుసుకుని తన మనసులో మాట బయట పెట్టేసింది గుంభనగా. ఆంజనేయులుకి ఇలాంటి విషయాల్లో బొత్తిగా అనుభవం లేదు. మొదట ఆమె మాటలు అసలు అర్థం కాలేదు. సూటిగా చెపితేనే అర్థం

చేసుకోలేని ఆంజనేయులు ఆమె కాస్త నర్మగర్భంగా చెప్పేసరికి తెల్ల మొహం వేసేశాడు. నీరజకి తన ప్రశ్నకి సమాధానం లభించనే లేదు చివరికి.

ఇలా కాదనుకుని పబ్లిక్ పరీక్షల చివరి రోజున అతణ్ణి వెంట బెట్టుకు పోయి తమ ఇంటిని దూరం నించి చూపించి, ఆ మరునాడు మధ్యాహ్నం తప్పకుండా రావలసిందిగా ఆహ్వానించింది. ఆంజనేయులు మొదట ఒప్పుకోలేదు. కాని, వాళ్ళ నాన్నగారు తనని చూడా లనుకుంటున్నారని ఆమె మరీ మరీ చెప్పటంతో చివరికి అంగీకరించాడు.

మరునాడు మధ్యాహ్నం ఆంజనేయులు నీరజా వాళ్ళింటికి వెళ్ళేసరికి ఆమె గుమ్మం దగ్గిరే అతని కోసం ఎదురుచూస్తూ కనిపించింది. ఆంజనేయులుకి ఇలాంటి అనుభవం కొత్త. బెరుగ్గా లోపలికి అడుగు పెట్టాడు. నీరజ ముఖం అతణ్ణి చూడగానే ఆనందంతో వికసించింది. కుర్చీలో కూచో బెట్టి, హడావిడిగా లోనికి పరుగెత్తుకు వెళ్ళి తను అంత క్రితం తయారుచేసి ఉంచిన షర్బతు తీసుకొచ్చి ఇచ్చింది. గ్లాసు తీసుకుంటుంటే ఆంజనేయులి చెయ్యి వణికింది. గుండె విపరీతంగా కొట్టుకుంది. ఎలాగో తాగటం పూర్తి చేసి గ్లాసు కింద పెట్టాడు. ఆమె ముఖం లోకి చూడటానికి చాలా ఇబ్బంది పడిపోయాడు. క్షణంలో సగం సేపు ఆమెను చూసిన కళ్ళు ఆరాధనగా తన వంకే చూస్తున్న ఆమెని చూడగానే కంగారుగా వాలిపోయాయి. ఇంట్లో ఆమె తప్ప ఎవరూ ఉన్నట్లు లేదు. అంటే ఆమె నాన్నగారు తనని చూడాలని రమ్మనటం నిజం కాదన్న మాట!

"ఎందుకు నీరజా రమ్మన్నావు?" ఎటో చూస్తూ అడిగాడు.

"ఎందుకు పిలిచానో చెప్పుకో చూదాం!" ఆమె కళ్ళు అల్లరిగా నవ్వుతున్నాయి.

"ఏమో, నువ్వు చెప్పందే నాకెలా తెలుస్తుంది?"

ఆమె నవ్వుతూ అతనికి సమీపంగా వచ్చి నిల బడింది. ఆమె వెచ్చటి ఊపిరి అతని మెడని కాల్చేస్తూంది.

"ఇలా చూడు మరి!" అతడి మొహంలోకి కళ్ళు పెట్టి చూసింది.

ఆంజనేయులు తల భూమిలోకి వంగిపోయింది. ఆమె వంక చూడలేకపోయాడు. అతడి ఒళ్ళు చెమటల్లు పోసింది. ఆమె నవ్వుతూ ఫేన్ ఆన్ చేసింది.

"మరీ అంత భయమెందుకు!? నేనేం రాక్షసినా, భూతాన్నా?" ఆమె అల్లరిగా నవ్వింది. "సరే గాని, నే నోమాట అడుగుతాను—దాచకుండా చెప్తావా?"

ఏమి టన్నట్టు చూశా డామె వంక. ఆమె కళ్ళలో వెలుగుతున్న ఆరాధనాభావం అతని భావాల కంద లేదు. చటుక్కున తల వాల్చేశాడు.



"నేనంటే నీ అభిప్రాయమేమిటి?" తనకే వినిపించనంత మెల్లిగా అడిగింది.

"నా అభిప్రాయం దేనికి? అయినా అడిగావు కాబట్టి చెబుతున్నాను. నువ్వు చాలా మంచిదానివి. అందంగా, చక్కగా ఉంటావు. ఇంకా... ఏమో, నాకెలా చెప్పాలో తెలీదు" అన్నాడు.

"అది సరే. నేనంటే నీ కిష్టమేనా?"

ఇష్టం మాట ఏమో గాని, ఆమె పట్ల అయిష్టం ఉండాల్సిన అవసరమేం కన్పించలే దతనికి. ఆదే అన్నాడామెతో.

"అబ్బబ్బ! నీతో గొప్ప చిక్కుగా ఉంది." అందంగా విసుక్కుం దామె. "సరే, సిగ్గు విడిచి నేనే చెప్పేస్తున్నాను. నిన్ను... నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వంటే నాకు ప్రాణం!" మొహాన్ని అరచేతుల్లో దాచుకుని, కాళ్ళ సందుల్లోంచి అతన్ని అరమోడ్పుగా చూస్తూ అంది. అతని మొహంలో తనాశించిన మార్పులేం లేకపోవటం చూసి హతాశురాలయింది.

తెల్లబోయి ఆమె వంక చూస్తున్నా డతను.

"నన్ను... ప్రేమిస్తున్నావా?" గొణుగుతున్నట్లుగా అన్నాడు.

"నీ కిష్టమైతే... మనిద్దరం పెళ్ళి చేసుకుందాం. నా కున్నది నాన్నగా రొక్కరే! తనకి నేను, నాకు తను—నా ఇష్టాన్ని కాదన రాయన." అతని కళ్ళలోకి ఆశగా చూస్తూ అంది.

"పెళ్ళా? ఇంత చిన్న వయసులోనా? ఒక పక్క స్కూల్ ఫైనల్ కూడా దాటలేదు. పదహారు సంవత్సరాలైనా నిండలేదు. మనకి పెళ్ళా? పైగా, మన మతాలు, కులాలు ఒకటి కాదు." తను అనాల్సిన రెండు మాటలు కంగారుగా అనేశాడు.

"నేను క్రిస్టియన్ని కదా అని వెనుదియ్యకు. మనసులు కలిస్తే కులాలు, మతాలు అడ్డురావు. మన చదువులు పూర్తయి జీవితంలో స్థిరపడ్డాకనే పెళ్ళి చేసుకుందాం. ఈ లోపల నా మనసు దాచుకోలేక నీ ముందు పెట్టేశాను. నువ్వు కాదంటే నేనేమయిపోతానో నాకే తెలియదు." ఆమె కంఠంలో ఏడుపు జీర ధ్వనించింది.

"ఊహుఁ! నువ్వంటే నాకా అభిప్రాయం లేదు. నిన్నెప్పుడూ నేనా భావంతో చూడలేదు. నాకీ ప్రేమలు, ఇష్టాలు తెలీవు. నా మానాన నన్నుపోనీ!" గమ్మున కుర్చీలోంచి లేచి గుమ్మంవైపు పారిపోతున్నట్టుగా అడుగులు వేశాడు.

వెళ్ళిపోతున్న ఆంజనేయుల్ని చటుక్కున చేయి పట్టుకుని లేపింది నీరజ. ఆమె కళ్ళు నీటితో నిండిపోయాయి. దెబ్బ తిన్న లేడిలా నిలువెల్లా వణికిపోతోంది. ఆమె పరిస్థితి నర్థం చేసుకోగల స్థితిలో లే డతను.

"విను, నీరజా. ఎవరన్నా చూస్తే బావుండదు." ఆమె చెయ్యి విడిపించుకుంటూ అన్నాడు.

"ఎవరన్నా చూస్తారని భయపడాల్సింది నేను. ఆడదాన్ని, నాకు లేని భయం నీకు దేనికి? పోనీ, ఈ ఒక్కమాట చెప్పి వెళ్ళిపో! నీకు నన్ను చేసుకోవటం అసలు ఇష్టమే లేదా? లేక ఇప్పట్లో చేసుకోవటం ఇష్టం లేదా? నువ్వు చేసుకుంటానంటే చాలు, మరో పదేళ్ళయినా నీ కోసం ఎదురుచూస్తూ ఇలాగే ఉండిపోతాను. చెప్పు, ఆంజనేయులూ, చెప్పు!" అతను తనని కాదనడనే ఆశ ఎక్కడో మిణుకుమంటోంది.

"మరోలా అనుకోకు, నీరజా! నా కటువంటి అభిప్రాయమే లేదు, ఉండదు!... వస్తాను." కంగారుగా బయటపడ్డాడు ఆంజనేయులు. అతను కావాలంటే తన సర్వస్వం ఆ క్షణంలో అర్పించటానికి సిద్ధంగా ఉన్న నీరజ లేత హృదయం మళ్ళీ కోలుకోలేనంతగా దెబ్బ తిన్నది.

ఆ తరవాత నాలుగేళ్ళకి మరో వూళ్ళో బి. ఎ. ఫైనల్ చదువుతుండగా ఆంజనేయులికి అకస్మాత్తుగా నీరజ గుర్తొచ్చింది. గుర్తు రావటానికి అతను మరిచిపోయిం దెప్పుడు? అంతర్గాంతరాల్లో ఆమె మెదులుతూనే ఉంది నాలుగేళ్ళు. ఆమెని గూర్చిన ఆలోచనలు తరుచు వెంట తరుముతూనే ఉన్నాయి. ఆలోచించగా తను చేసిన పొరపాటేమిటో వికసించిన అతని మనసు కర్థమైంది. దానతో పాటే మరో నగ్నసత్యాన్ని కూడా అతని మనసు నమ్మక తప్పలేదు. అది — తను నీరజని ప్రేమించాడు. తెలిసీ తెలీని, నిలకడ లేని వయసులో ఆమె మీది ఇష్టాన్ని తను తెలుసుకోలేకపోయినా, దాన్ని 'ప్రేమ' అనే పేరుతో పిలవకపోయినా తన మనసులో నీరజ ఏర్పరచుకున్న స్థానం అంత తేలికైంది కాదు. అది ఇన్నాళ్ళు తనకే ఖచ్చితంగా తెలియలేదు. తన మనసునే తను మభ్యపెట్టుకుంటూ వచ్చా డిన్నాళ్ళు. ఇప్పు డా మనసే ఎదురు తిరిగి, ఆమె మీది ప్రేమని ఒక్కసారి వెళ్ళగక్కింది.

ఆ మర్నాడే ఆంజనేయులు తను వూరు పరుగెత్తుకు వెళ్ళాడు. ఆ వెళ్ళటం సరాసరి నీరజా వాళ్ళింటికి వెళ్ళాడు. ఆమె ఇల్లు దగ్గర పడుతున్న కొద్దీ అదురుతున్న గుండెని, టెన్షన్ని అట్టుకోటం మరీ కష్టమనిపించింది. అక్కడ ఆశించని పరిస్థితి ఎదురయింది. నీరజ తండ్రికి మరో వూరు ట్రాన్స్ఫరయిందని, ఆర్నెల్ల క్రితం ఆ వూరు వదిలి పోయారని పక్క ఇంటి వాళ్ళు చెప్పారు. ఏ వూరో సరిగా చెప్పలేకపోయారు. ఆంజనేయులు దెబ్బ తిన్న పక్షిలా విలవిలలాడాడు.

అంతే! అప్పట్నుంచీ ఆంజనేయులు ఆడపిల్లల మనసుల జోలికి మరి పోలేదు. తనేమిటో, తన చదువేమిటో నన్నట్టుగా ఉండిపోయాడు. బి. ఎ. పూర్తి చేసి, సొంత వూళ్ళో ఉద్యోగం సంపాదించుకుని, జీవితంలో ఒక విధంగా స్థిరపడిపోయాడనే చెప్పొచ్చు. కాని, తన మనసులో పీటం వేసుక్కూచున్న నీరజ రూపాన్ని మాత్రం చెరిపివెయ్యలేకపోయాడు.

అదిగో, ఆ ముద్ర పడ్డ రూపమే ఎన్నిసార్లు పెళ్ళిచూపులకి వెళ్ళినా, ఎదురుగా కూర్చున్న అమ్మాయితో పొత్తు కుదరనివ్వలేదు. చివరికి అతని పురుషత్వాన్నే సవాల్ చేసింది.


ఆంజనేయులు వయస్సు మరో మూడేళ్ళు తనలో కలుపుకుం దిప్పుడు. తనకి పెళ్ళి కాలేదనిగాని, ఇకముందు కాదేమోననిగాని అతనికి కించిత్తు కూడా చింత ఉన్నట్టు కన్పించదు. అలా అని తప్పుదర్లు తొక్కాలనే ఉద్దేశం అసలే లేదు. అతని ఘోటక బ్రహ్మచర్యం ఆఫీసులో అందరికీ తెలుసు. వాళ్ళు లైట్గా జోక్స్ కట్ చేసినా, చిరునవ్వుతో భరించేవాడేగాని, ఛర్చ పెరగనిచ్చేవాడు కాదు, తన పెళ్ళి విషయం మీద. తన కిష్టంలేని రోజుల్లో అందరూ తనకి పిల్లనిస్తామని వచ్చినవాళ్ళే! ఇప్పుడు తనంత తాను కోరుకుంటూంటే ఒక్కరూ ముందుకి రావటం లేదు. దానికి తగ్గట్టు తన కీ మధ్య బొత్తిగా పెళ్ళి మీదికి గాలి మళ్ళిపోయింది. అందు క్కారణం ఒక విధంగా వెంకట్రావే చెప్పాలి!

వెంకట్రావు ఆంజనేయులు కొలీగ్. విలాస పురుషుడు. అతనికి లేని అలవాటు లేదు. ఎలా కుదిరిందో గాని ఆంజనేయులికి, అతనికి మంచి దోస్తీ!



ఆంజనేయులుతో అతను ఆడవాళ్ళతోడి తన అనుభవాల గురించి కథలు కథలుగా చెబుతుండేవాడు. చదువుకొనే రోజుల్లో అమ్మాయిల వేటలో తను గోడలెక్కటం, దేహశుద్ధి చేయించుకోవటం ఇత్యాది సాహస కృత్యాల్ని వివరంగా ఆంజనేయులికి వర్ణించి చెప్పేవాడు. స్త్రీ సాంగిత్యం రుచి చూడని జీవితం జీవితమే కాదన్నాడు. అలాంటి బతుకు బతికేకన్నా ఉరిపోసుకు చావటం మేలన్నాడు. ఇరవై ఎనిమిదేళ్ళ ఆంజనేయులికి ఆడదానితో అనుభవం లేదని విని చాలా ఆశ్చర్యపోయాడు. అనక కూకలేశాడు.

"చూడు, బుజ్జీ! నీకు ఆడాళ్ళ పట్ల ఇంత శత్రుత్వం ఎందుకో నా కర్థం కాదు. పోనీ, అడ్వాన్స్‌గా ఒక రాత్రి రుచి చూడు. నాతో రా—తీసుకెళ్తాను. ఒక పాతిక రూపాయలు నీవి కావనుకో. రేపటికల్లా నువ్వు పెళ్ళంటూ గోల పెట్టకపోతే నా పేరు మార్చేసుకుంటాను." ఘోరంగా శపథం చేసేశాడు వెంకట్రావ్.




"సారీ, బ్రదర్! నా కలాంటి దాన్ల తొక్కటం ఇష్టముండదు. అలాంటి అవసరమే వస్తే నీకు తప్పక చెబుతాను." అప్పటి కా విషయాన్ని దాటవేశాడు ఆంజనేయులు.

అదిమొదలు ఆంజనేయులు తనువు, మనసు అతని మాట వినటం మానేశాయి. హృదయంలో ఏదో ఆరాటం, తెలీని కొత్త పులకింత, స్పందన. ఏదో కావాలనే తపన, ఏదో చేసెయ్యాలనే తాపత్రయం — ఆతణ్ణి ఏ పనీ చెయ్యనివ్వటం లేదు. ఇన్నాళ్ళు ఎంతో ఏకాగ్రతతో చేస్తూ వచ్చిన ఆఫీసు పనుల మీద చెప్పరాని విసుగు, కసి, తన మీద తనకే చెప్పలేని కోపం!

ఆంజనేయులు ఇలాంటి పరిస్థితిలో ఉండగానే ఒక రోజు వెంకట్రావు అతనితో తన సరికొత్త అనుభవం, ఆ అనుభవం పంచుకొన్న అమ్మాయిని గూర్చిన పూర్తి వివరాలు అత నడక్కుండానే వనపిట్టలా వడవడా వాగేసి, అనక ఆంజనేయులు ముఖం చూసి, "సారీ, బ్రదర్!" అంటూ జారుకున్నాడు. కాని, ఆంజనేయులు అప్పటికే ఎక్స్‌యిట్ అయిపోయాడు. దాన్ని వెంకట్రావు మరోలా అర్థం చేసుకుని తప్పుకున్నాడుగాని, ఇంకో క్షణం అతనక్కడే ఉంటే ఆంజనేయులు అతని సహాయం కోరుండేవాడు. ఆంజనేయులు మనసు పూర్తిగా అతని వశం తప్పిపోయింది. లాభం లేదు. ఏమైనా సరే, ఆ అనుభవం ఎలాంటిదో చూడాలి! ఒక నిర్ణయాని కొచ్చేశాడు!

ఆ రోజు ఆఫీసునుంచి పెందరాలే వచ్చేశాడు. శుభ్రంగా ముస్తాబై కనుచీకటి పడుతుండగా వెంకట్రావు చెప్పిన గుర్తులు పట్టుకుని బయులుదేరాడు. పుట్టి పెరిగిన వూరు—పైగా ఆ రోడ్డున ఆంజనేయులు అనేకసార్లు వెళ్ళి వస్తాడు రోజూ షైరుకని. దాదాపు మైలున్నర నడిచి, పవర్ స్టేషన్ దాకా వెళ్ళి, కాసేపు కూచుని తిరిగి వస్తుండేవాడు. వూరికి దూరంగా ప్రశాంతంగా ఉంటుందక్కడ. అప్పుడప్పుడు వెంకట్రావు అతనితో వస్తుండే వాడు. అతనొచ్చినప్పుడు ఆంజనేయులితో ఆ వీధి పొడవునా ఏ అమ్మాయి ఏ ఇంట్లో ఉంటుందో, ఎంత తీసుకుంటుందో పేరు పేరునా వర్ణించి చెపుతుండేవాడు. వినకూడ దనుకుంటూనే ఒక చెవి అతని కప్పగించేసేవాడు ఆంజనేయులు.

ఆ కారణంగా వెంకట్రావు చెప్పిన గుర్తుల్నిబట్టి ఆ ఇల్లు కనుక్కోవటం కష్టమనిపించలేదు ఆంజనేయులికి. ఆ వీధి మలుపు తిరుగుతూండగానే ఒకరిద్దరు కుర్రాళ్ళు అతని వెనకపడి అమ్మాయిల దండకం చదవటం మొదలెట్టారు. వాళ్ళని విదిలించుకుని వదిలించుకునే సరికి ఒళ్ళంతా చీదర పుట్టిం దతనికి.

బాగా చీకటి పడింది. తననెవరూ గుర్తుపట్టడం లేదని ధైర్యం వచ్చాక చటుక్కున ఆ ఇంటి మెట్లెక్కి తలుపు కొట్టబోయాడు. తలుపులు వోర వాకిలిగా వేసే ఉన్నాయి. లోపలి కడుగుపెట్టడానికి ధైర్యం చాల లేదు. గుండె లయ తప్పి కొట్టుకుంటోంది. అసలు ఆ ఇల్లో, కాదో నని శంక మరోపక్క! ఏదో తెలీని ఆరాటం, ఏదో తప్పు చేస్తున్నాననే గిల్టీ కాన్షస్‌నెస్, ఎవరన్నా చూస్తే తన పరువేమవుతుందోననే భయం — అతణ్ణి వెనక్కి అడుగు వేయించాయి. కాని, ఇంతలో ఒక బొంగురు గొంతు, "ఎవరు కావాలి?" అంటూ ప్రశ్నించటంతో అత నా ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

"విజయ ... విజయ ఉందా?" కంగారు కొంత, భయం కొంత కంఠాన్ని నొక్కేస్తుండగా ఎలాగో అడిగాడు.

"ఆ గదిలో ఉంది, వెళ్ళండి. బయటనే నిలబడిపోయారేం?"

లోపలికి పరుగులాంటి నడకతో అడుగులు వేశాడు ఆంజనేయులు. అతను వంచిన తల పైకెత్తి చూసే సరికి, అలంకరణతో ధగధగ మెరిసిపోతూ అప్సరసలా ఉన్న ఒక అమ్మాయి అతని కనిపించింది. నిజంగా ఆమె అందంగా ఉందో, లేక అతనున్న పరిస్థితి అలా అనిపించేలా చేసిందోగాని, ఆమె మీద నుంచి కళ్ళు తిప్పుకోలేకపోయాడు. ఆమెకి పదహారు, పదిహేడు సంవత్సరా లుండొచ్చు ననుకున్నాడు, నిజానికి ఇరవై పైబడి ఉన్నా. ఆమె అతని వంకే చిరునవ్వుతో చూస్తోంది. ఆమెతో నీరజని పోల్చుకోకుండా ఉండాలని విశ్వప్రయత్నం చేశాడు. అయితే, చాలా చిత్రంగా నీరజకన్న ఎన్నో రెట్లు అందగత్తెలా కనిపించిం దా అమ్మాయి.

"అలా చూస్తున్నారేం?" నవ్విం దామె.

తడబడ్డాడు ఆంజనేయులు. "విజయ ... మీరేనా విజయ?"

"మీ కా అనుమానమే అక్కర్లేదు. ఈ ఇంట్లో వయసులో ఉన్న అమ్మాయి ఈ విజయ ఒక్కతే. అయినా నా పేరు మీ కెలా తెలుసు? మిమ్మల్ని ఇదివరలో చూసిన గుర్తు లేదు" అం దామె ఇంకా నవ్వుతూనే.

అతను వెంటనే మాట్లాడలేదు. గుండె వేగంగా కొట్టుకుంటోంది. నాలుక పొడారిపోయింది. వయసులో ఉన్న పిల్లతో, అందునా ఒక వేశ్యతో రాత్రి పూట ఇది చాలా వింత అనుభవం అతనికి!

"వెంకట్రావు చెప్పాడు!" గొంతు పెగుల్చుకుని చెప్పాడు.

"ఇక్కడి కెంతో మంది వస్తుంటారు. సాధారణంగా వాళ్ళ పేర్లు అడగం, వాళ్ళు చెబితే తప్ప! చెప్పినా మాకు గుర్తుండదు కూడా!"

తను అనవసరంగా వెంకట్రావు ప్రసక్తి తెచ్చాడు. అయినా మధ్యలో అతని సంగతి దేనికి? అనుకున్నాడు.

అతను మాట్లాడకపోయేసరికి ఆమే తిరిగి అడిగింది:

"మీ దే వూరు?"

"ఈ వూరే!" అలా ఎందు కడిగిందో అర్థం కాలే దతనికి.

"కొత్తలా ఉందే!" మళ్ళీ నవ్వింది.

కనిపెట్టేసింది. తనని చాలా తొందరగా పట్టే

సింది. అతను చాలా ఇబ్బందిగా ఫీలయాడు. ఒళ్ళంతా చెమటల్లు.

తలాడించాడు అవునన్నట్లుగా.

"ఏమిటి కొత్త? ఇలాంటి చోటా, అనుభవమా?" కింకిల నవ్వింది మరోసారి.

ఆమె చాలా తెలివిగా మాట్లాడుతోంది. తను బొత్తిగా ఫూలయిపోతున్నాడు. చదువుకున్న పిల్లలా ఉంది.

"రెండూను!" అన్నాడు తనేం తక్కువ తినలే దన్నట్లుగా.

"నే న్నమ్మను. ఇంత వయసొచ్చాక మీ కింకా ఆడగాలి సోకలేదంటే నేనేకాదు, ఎవరూ నమ్మరు."

ఆంజనేయులికి తనమీద తనకే చిరాకేసు కొచ్చింది. చివరికి ఒక వేశ్యకు కూడా తను లోకువై పోయాడు. ఛీ...ఛీ! తనిక్కడికి రాకుండా ఉండాల్సింది! మనసులోనే నిందించుకున్నాడు.

"ఎంతసేపు ఉంటారు?" మళ్ళీ ఆమే అడిగింది.

"అంటే?" తెల్లబోయి చూశాడు.

"అంటే ... ఒకసారికా, గంటకా, రాత్రంతానా?"

అతని కీ భాష తెలీదు. అతని కిటువంటి వాటిలో ప్రవేశం లేదని కనిపెట్టేసిం దామె. తనే విడమరిచి చెప్పింది, ఆంజనేయులి కర్థమయేలాగా.

నాలుగు పదులు తీసి ఆమె చేతి కందించాడు. ఆమె అవి తీసుకుని లోపలికి వెళ్ళింది. కొన్ని క్షణాల్లో తిరిగొచ్చి తలుపులు చేరవేసింది. గడియ పెడుతుండగా, కంగారుగా లేచి, "ప్లీజ్, తలుపు వెయ్యకండి!" అన్నాడు ఆంజనేయులు.

ఆమె ఆగి విచిత్రంగా చూసిం దతని వంక.

"తలుపులు తీసి ఇలా వచ్చి కూర్చోండి. మీతో మాట్లాడాలి!" అన్నాడు. తలుపులు వెయ్యకపోవటానికి, తనతో మాట్లాడటానికి సంబంధం అర్థంకాలే దామెకి. మవునంగా అతను చెప్పినట్లే చేసింది.

"ఇలా కూచోండి" అన్నాడు ఎదురుగా ఉన్న కుర్చీ చూపించి. "మిమ్మల్ని కొన్ని విషయాలు అడుగుతాను, చెప్తారా?" అన్నాడు.

అడగమన్నట్టు చూసిం దతని వంక. •

"మీ రింత చిన్న వయసులోనే ఈ వృత్తిలోకి ఎందుకు దిగారు?"

"బోగంవాళ్ళింట్లో పుట్టానుగనక. ఇక పోతే వయసు విషయ మంటారా? ఈ వయసులో కాక వయసయిపోయాక దిగమంటారా?" అల్లరిగా నవ్వింది.

"మరి వయసులో ఉన్నన్నాళ్ళు సంపాదిస్తారు— బాగానే ఉంది! ఆ తర్వాత మీ మొహం చూసేవాళ్ళుండరు. అప్పుడు?"

"ఈ లోపల ఆడపిల్ల పుడితే సరే! లేకుంటే అందంగా ఉన్న ఏ పిల్లనో చూసి కొనుక్కు తెచ్చి పెంచుకుంటాం. ఆ పిల్ల ఎదిగొచ్చేసరికి మా వయసయిపోయినా ఫర్వాలేదు."

"మీరు చదువుకున్నారా?" బహువచనంలోనే మాట్లాడుతున్నాడు.

అవునన్నట్లు తలూపింది.

"ఎంతవరకు!"

"ఎంత చదివినా సాని సానేగా!"

"అదేమిటి? బోగంవాళ్ళింట్లో పుట్టినంత మాత్రాన నువ్వు కన్యగానే బతకాల నేముంది? చదువు సార్థకం చేసుకోవచ్చుగా!" ఆంజనేయులికి ఆమెతో మాట్లాడుతున్న కొద్దీ ధైర్యం వచ్చేస్తోంది. బెరుకు, గుండెదడ తగ్గుముఖం పట్టాయి.

"మీరు డబ్బెందు కిచ్చారో మర్చిపోయారా ఏం?"

"ఫరవాలేదు. ముందు నే నడిగిన వాటికి సమాధానాలు చెప్పండి. డబ్బు కావాలంటే ఇంకా ఇస్తాను.... మిమ్మల్ని ఈ వృత్తిలోకి దింపిన పరిస్థితుల గురించి వినాలని ఉంది" అంటూ మరో రెండు పదులు ఆమె కందించాడు.

'వద్దు' అంటూనే తీసుకొన్న దామె. గొంతు సవరించుకుని చెప్పడం మొదలెట్టింది:

"నాలాంటి వేశ్యలందరిదీ ఒకటే కథ! అయితే నాది కొంత భిన్నమైన కథ. మీరు వింటానంటే చెప్పేందుకు నా కభ్యంతరం లేదు. వినండి. నేను స్కూల్లో చదువుకుంటున్నప్పుడు ఎన్నో కలలు కంటుండేదాన్ని. మా కులం వాళ్ళలా వృత్తి చెయ్యకుండా నచ్చినవాణ్ణో, నన్ను మెచ్చినవాణ్ణో పెళ్ళి చేసుకుని సంసార జీవితం సుఖంగా గడపాలని, గర్వంగా సంఘంలో తలెత్తుకుని తిరగాలని అనుకునే దాన్ని. కాని, పరిస్థితులు తారుమారయ్యాయి. నేను స్కూల్ఫైనల్ చదువుతుండగా, అంత కాలంగా మా అమ్మని చేరదీసి, మమ్మల్ని పోషిస్తున్న షావుకారు మొహం చాటేశాడు. ఇల్లు గడవటం కష్టమైపోయింది. అమ్మ నన్ను వృత్తిలోకి దింపాలని ప్రయత్నించింది. నేను ఒప్పుకోలేదు. తిట్టాను, ఏడ్చాను. అమ్మ అప్పటికి వూరుకుంది. ఇంతలో తమ్ముడికి జబ్బు చేసింది. మందులకి డబ్బు లేదు. తమ్ముడి పరిస్థితి చూసి కడుపు తరుక్కుపోయింది. తమ్ముడు దక్కే సూచనలు కనిపించలేదు. అమ్మ నా కాళ్ళావేళ్ళా పడి వేడుకుంది, తమ్ముణ్ణి బతికించమని. నేను వూ అంటే వేలు కురుస్తాయంది.

ఒక పక్క పస్తులు, తమ్ముడి అనారోగ్యం, నా కలలు వమ్మయ్యాయనే నిరాశ—నన్ను అమ్మ మాట వినేలా చేశాయి. ఫలితం—నాకు కన్నెరికం చేశారు. దాంపత్య జీవితం గురించి బంగారు కలలు కన్న నేను చివరికి వేశ్యగా మారక తప్పలేదు. తమ్ముడూ దక్కలేదు." ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

ఆంజనేయులు చలించిపోయాడు ఆమె కథ విని.

ఆమె కళ్ళు తుడుచుకుని నవ్వి, "నా పాడు సొదితో మిమ్మల్ని విసిగించినట్టున్నాను. రండి, మీరు నన్ను డబ్బిచ్చి కొనుక్కున్నారు. మిమ్మల్ని ఆనందపెట్టాల్సిన బాధ్యత నామీ దుంది" అని లేచి అతని చెయ్యి పట్టుకుంది.

ఆంజనేయులు ఒళ్ళంతా జలదరించింది. వయసులో ఉన్న నిండు జవ్వని తనని తాకటం—బహుశా ఇది రెండవసారి. మొదటిసారి నీరజ తనని వెళ్ళనివ్వకుండా చెయ్యి పట్టి ఆపింది, పదేళ్ళ క్రితం. మళ్ళీ ఇన్నాళ్ళకి విజయ! మెల్లగా ఆమె చేతినుంచి తన చెయ్యి విడిపించుకున్నాడు.

కర్టెను వెనక గాజుల చప్పుడు! ఇందాకటి బొంగురు గొంతు, "విజ్జీ!" అంటూ పిలిచింది. బహుశా ఆమె విజయ తల్లి అయుంటుందని వూహించాడు ఆంజనేయులు. విజయ వెళ్ళి మళ్ళీ రెండు నిముషాల్లో తిరిగొచ్చింది.


అతను ప్రశ్నార్థకంగా చూశా డామె వంక.

"అమ్మ కీ మధ్య డబ్బు కాపీనం ఎక్కువైపోయింది. ఎవరో సొపింజ రొచ్చాడట. మిమ్మల్ని తొందరగా వదిలించుకోమంటూంది. మర్యాద తెలియదు ముసల్దానికి." తల్లి మీద విసుక్కుంది విజయ.

ఆంజనేయులు మరో రెండు పదులు తీసి ఆమె చేతి కిచ్చాడు.

"వద్దండీ! ఇప్పటికే అదనంగా ఇరవై ఇచ్చారు. మళ్ళీ మరో ఇరవయ్యా?" ఆమె తీసుకోలేదు.

"ఫరవాలేదు, ఉంచండి. మీ అమ్మ తృప్తి కోసం!" బలవంతంగా ఆమె గుప్పిట్లో ఉంచాడు.



"చెపితే వినరు కదా! అది సరే, నన్ను ఇంటర్వ్యూ చెయ్యటం అయిందా, ఇంకా ఉందా?" బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని వచ్చి అతని సరసన సోఫాలో కూచుంది. ఆమె ఒంటి మీద నుంచి బలవంతంగా దృష్టి మరల్చుకున్నాడు.

"ఇంకో మాట అడుగుతాను, విజయా! మీ రీ వృత్తికి స్వస్తి చెప్పి పెళ్ళి చేసుకో కూడదా?"

అతని మాటకి విరగబడి నవ్విం దామె. "పెళ్ళా? సానికి పెళ్ళా?" తెరలు తెరలుగా నవ్వింది. తను నీరజతో పదేళ్ళ క్రితం అన్న మాటలు గుర్తొచ్చాయి ఆంజనేయులికి.

"ఎగతాళి కాదు, సీరియస్‌గానే అంటున్నాను."

"అది ఒకప్పుడు. ఇప్పుడు నన్నెవడు చేసుకుంటాడు?"

"మిమ్మల్ని చేసుకునే మగాడుంటే చేసుకునేందుకు మీకు అభ్యంతరమా?"

"అభ్యంతరమా? నన్ను చేసుకునే దౌర్భాగ్యుడెవడంటున్నాను! అయితే మా కులంలోకూడా పెళ్ళిళ్ళు చేసుకుని గౌరవంగా బతుకుతున్నవాళ్ళు ఉన్నారు. కాని, వాళ్ళు వృత్తిలోకి దిగక ముందే జాగ్రత్త పడతారు. నా కన్నీ అయిపోయాయి. ఇక ఆశలేదు."

"విజయా! నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను." మొదటిసారిగా ఏకవచనంతో పిలిచా డామెని.

"ఏమిటి మీ రంటున్నది?" నిజంగానే ఆశ్చర్య పోయిం దామె.

"అవును, విజయా! నిన్ను పెళ్ళి చేసుకోవాలను కుంటున్నాను. నీ కిష్టమేనా?"

"నే నొక పచ్చి వ్యభిచారిణి అన్న సంగతి మరిచి పోయారా? నేను ఇల్లాలిగా అనర్హురాల్ని. వాసన చూసిన పువ్వు దేవుడి అర్చనకి పనికిరాదు. మీ నిండు మనసుకి నా జోహార్లు. మనుషుల్లోకూడా దేవు డుంటాడని రుజువు చేశారు మీరు!" అతనికి నమస్కరించింది.

ఆంజనేయులు ఆమెకి దగ్గరగా వెళ్ళాడు. ఆమె చుబుకం పట్టుకుని ఆమె కళ్ళలోకి చూస్తూ "నన్ను దేవుడితో పోల్చకు, విజయా! నేను నీ పరిస్థితికి జాలిపడి కాని, నిన్ను ఉద్ధరించాలని కాని ఇందుకు పూనుకోవటం లేదు. నాలో స్పందన కలగ జేసిన తొలి స్త్రీవి నువ్వు. ఆడదంటే ఆమడ దూరానికి తొలగిపోయే ఘోటక బ్రహ్మచారిని. నిన్ను చూశాక జీవితం మీద తొలిసారిగా ఆశ, మమకారం పుట్టాయి. నిన్ను పెళ్ళి చేసుకోవటంలో నా స్వార్థం కూడా లేకపోలేదు."

"క్షమించండి. మీరు చేసుకోవాలనుకున్నా, నేను మిమ్మల్ని చేసుకోవటానికి సిద్ధంగా లేను. మీరు నా జీవితంలో రెండు సంవత్సరాల క్రితం తారసపడి ఉంటే, నా కన్యాత్వం ఆనందంగా మీ కాళ్ళ ముందు అర్పించుకుని, నా జన్మకి ధన్యత చేకూర్చుకుని ఉండేదాన్ని! నేను వేశ్యనైనా, నా నీతి నా కుంది. ఆత్మవంచన చేసుకునేంత నీచురాల్ని కాదు."

అతని అహం దెబ్బ తిన్నది. "అంటే, నేనుగా అడిగాననా?"

"దయచేసి అపార్థం చేసుకోకండి. నా బతుకు లోకానికి తెలుసు. కళంకితమైన నేను మీ జీవితాన్ని కలుషితం చెయ్యటమే కాక, సంఘంలో మీ పరువు, మర్యాదలన్నీ మంట కలిసిపోయేలా చేసిన దాన్నవుతాను. అది నా కిష్టం లేదు. నన్ను క్షమించండి."

ఆంజనేయులు దీర్ఘంగా నిట్టూర్చి గుమ్మం వంక రెండు అడుగులు వేశాడు. "వస్తాను."

"ఆదేమిటి, వెళ్ళిపోతున్నారేం?" అతని కెదురుగా నిలుచుని అతని కళ్ళలోకి చూస్తూ "ఈ శరీరం మీది. మీకు దీనిమీద సర్వ హక్కులూ ఉన్నాయి. డబ్బిచ్చి నందువల్ల కాదు, నా మనసు మీద అధికారం సంపాదించినందువల్ల! రండి, ఈ ఒక్క రాత్రయినా మీ భార్యగా ఉండే అదృష్టం కలిగించండి!"

"నాది కానిదాన్ని అనుభవించే దురాశ నాకు లేదు."

"నా అంతట నేను అర్పించుకుంటుంటే, అది మీ దురాశ ఎలా అవుతుంది?"

"ఎలా అయినా నా దృష్టిలో ఒకటే! అడ్డులే, వెళ్ళాలి!"

అతని ధోరణి ఇక మారేలా లేదు.

"ఉండండి, ఇప్పుడే వస్తాను." గబగబ లోనికి వెళ్ళి నోట్లతో తిరిగొచ్చి—"ఇంద మీ డబ్బు! ఉత్త పుణ్యానికి తీసుకునే అలవాటు నాకు లేదు. నేను వేశ్యనైతే కావచ్చు కాని, యాచకురాల్ని మాత్రం కాదు!" అం దామె.

"నాతో ఇంత సేపు గడిపినందుకు ఇది నే నిచ్చిన ప్రతిఫలం. నీ వద్దనే ఉంచు" అని కదిలి బోయాడు.

ఆమె చటుక్కున అతని పాదాల మీద వాలి పోయింది.

"ఏమి టిది?" కంగారుగా అడిగాడు.

"మీ పాదాలకి నమస్కరించే హక్కు నా కుంది. మీరు వచ్చిన పని సఫలం కాకుండా వెళ్ళి పోతున్నందుకు బాధగా ఉన్నా, మిమ్మల్ని మలిన పరచనందుకు ఆనందంగా ఉంది. వెళ్ళండి! ఇక ఎప్పుడూ ఇలాంటి నరకంలో అడుగు పెట్టకండి. మంచి పిల్లను చూసి పెళ్ళి చేసుకుని బిడ్డా పాపలతో నూరేళ్ళు సుఖంగా గడపండి. ఇదే నేను భగవంతుని కోరుకునేది!" వెక్కి వెక్కి ఏడ్చిం దామె.

ఇక అక్కడ నిలుచోలేక బయటికి వచ్చేశాడు ఆంజనేయులు.

గుమ్మం దిగుతుండగా కిలకిల నవ్వులు వినిపించాయి లోపలి నుండి. అతని కాళ్ళు అకస్మాత్తుగా నిలిచిపోయాయి. అది విజయ నవ్వు! ఇంతవరకు ఏకధారగా ఏడ్చి ఇంతలో ఎంత హాయిగా నవ్వుతూంది! నవ్వుని చీల్చుకు వచ్చిన మాటలు ఆంజనేయులు మతి పోగొట్టాయి.

"ఏమే, విజ్జీ, ఎందుకే ఆతణ్ణి ఏడిపించావు? నువ్వు చెప్పిన కథంతా పూర్తిగా నమ్మేసినట్టుందే, పాపం!" అది బొంగురు గొంతు మాటలు.

"ఏమనుకున్నావమ్మా, నీకూతు రంటే?! నువ్వు నేర్పిన విద్యే ఇది. నాలుగు సినిమా డైలాగులు చెప్పి, కల్లబొల్లి ఏడుపు ఏడ్చెయ్యగానే ఒంటిమీద చెయ్యి వెయ్యకుండానే ఎనభై రూపాయలు చెల్లించుకుని బయట పడ్డాడు, దేవదాసు పోజులో. లేకపోతే వీడి బతుక్కి తోడు ఈ అడంగి వెధవని నేను పెళ్ళాడాలా?" పగలబడి నవ్వింది.

భూమి బద్దలై తను అందులో కూరుకు పోతే బాగుండు ననిపించింది ఆంజనేయులికి. బయట పుచ్చపువ్వు లాంటి వెన్నెల అతణ్ణి చూసి ఫక్కుమని నవ్వింది. ★

